క్లుప్తంగా

24 నుంచి ప్రవచనాలు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఉద్యానవనంలో ఈనెల 24, 25, 26 తేదీల్లో రోజూ సాయంత్రం 6 గంటలకు ఉమా సహస్రం గ్రంథంపై విశేష ప్రవచనాలు ఉంటాయని ఆర్యవైశ్యసభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావుచే ప్రవచనాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

రాయల్‌ రషీద్‌ మరణం కళా రంగానికి తీరని లోటు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : రాయల్‌ ఫొటో స్టూడియో అధినేత రాయల్‌ రషీద్‌ మరణం కళా రంగానికి తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రాయల్‌ రషీద్‌ కుటుంబాన్ని కాంగ్రెస్‌ నాయకులు పరామర్శించారు. కాంగ్రెస్‌ నాయకులు ప్రసాద్‌ గౌడ్‌, రామకృష్ణ, ఉత్తన్న, శివ, సత్యం పాల్గొన్నారు.

సార్వత్రిక ఇంటర్‌ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్‌ : ఇంటర్‌ను మధ్యలో ఆపేసిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సార్వత్రిక విద్యా విధానం ద్వారా ఇంటర్‌లో చేరేందుకు ఆంధ్రప్రదేశ్‌ ఇంటర్‌ విద్య మండలి అవకాశం కల్పించిందని కడప ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ నూర్జహాన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి ప్రత్యేక శిక్షణ ద్వారా ఏప్రిల్‌ మాసంలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. కావున కడప ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాలలో చేరదలచిన విద్యార్థులు, ఇంటర్‌ను చదవదలచిన వారు తమ 10వ తరగతి మార్కు లిస్టుతో ఈ నెల 27వ తేదీలోపు కళాశాల ప్రిన్సిపాల్‌ను కలిసి అడ్మిషన్లను పొందవచ్చని తెలిపారు. మిగతా వివరాలకు ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ రాజారావును 9908051885, 9182099672 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్‌ నూర్జహాన్‌ తెలిపారు.

'మేము సైతం' ఆధ్వర్యంలో అంత్యక్రియలు

కడప అర్బన్‌ : కడప నగరంలోని రైల్వేస్టేషన్‌ ముఖ ద్వారం వద్ద అనారోగ్యంతో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తికి (55) రైల్వే పోలీసులు పంచనామా నిర్వహించారు. బంధువులు ఎవరూ లేకపోవడంతో మేము సైతం వారికి సిఫారసు చేశారు. దీంతో వారు మృతదేహానికి హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేము సైతం ప్రతినిధులు ఆర్టీసీ కానిస్టేబుల్‌ రవి, వంకధారి రాము, రెడ్డెయ్య, పుట్టా పురుషోత్తం, రామలోకం, సివిల్‌ సప్లై సురేష్‌, దుబాయ్‌ కేఫ్‌ విజయ్‌, కృష్ణయ్య, గురువయ్య, రామరాజు, రాంబాబు, రైల్వే పోలీస్‌ హెడ్‌కానిస్టేబుల్‌ నాయక్‌ పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో జారిపడిన లిఫ్ట్‌

కడప కార్పొరేషన్‌ : కడప నగరపాలక సంస్థలో కరెంటు ఆఫ్‌ కావడంతో లిఫ్ట్‌ జారిపడింది. ఆ సమయంలో అందులో ఎక్కిన ముగ్గురు ఉద్యోగులు కిందికి జారి సుమారు అరగంట పాటు ఇరుక్కుపోయారు. అదృష్టవశాత్తు లిఫ్ట్‌ రెండో అంతస్తు నుంచి జారిపడినా అందులో ఉన్న ఉద్యోగులకు ఏమీ కాకపోవడంతో సహచర ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. చివరికి లిఫ్ట్‌ ఆపరేటర్లు వచ్చి వారిని బయటికి తీశారు.

గర్భిణులు యోగా, ధ్యానం చేయాలి

రాజుపాళెం : గర్భిణులు బలవర్థక ఆహారం తీసుకోవడంతో పాటు యోగా, ధ్యానం చేయాలని ఆర్‌బీఎస్‌కే స్టేట్‌ ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ కిరణ్‌ తెలిపారు. రాజుపాళెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి మాత శిశురక్షణకు సంబంధించిన కార్డులు, రాష్ట్రీయ బాలల స్వస్థత కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. డాక్టర్లు మంజుల, ఎంపీహెచ్‌ఈఓలు శివశంకర్‌రెడ్డి, రవిశంకర్‌రాజు, సూపర్‌వైజర్‌ లక్ష్మీనారాయణ, లాజిస్టిక్‌ మేనేజర్‌ మురళి, సీహెచ్‌ఓలుపాల్గొన్నారు.

మండలంలోని సచివాలయాల తనిఖీ

బి.కోడూరు : మండలంలోని తుమ్మలపల్లె, తంగేడుపల్లె, మేకవారిపల్లె గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రధానమంత్రి జన్‌ ఆరోగ్య యోజన పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల డేటా ఎంట్రీపై బుధవారం ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్‌, ఆరోగ్య విస్తరణాధికారి నరసింహారెడ్డిలు ఏఎన్‌ఎం, వలంటీర్లతో పై మూడు సచివాలయాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంజేఏవైకి ఎంపికైన లబ్ధిదారుల డేటా ఎంట్రీ ఎంత మేర ప్రోగ్రెస్‌ పూర్తయింది, ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఆధారాలు తీసుకురండి

మైదుకూరు : మైదుకూరు నుండి బద్వేలుకు జాతీయ రహదారి కోసం భూసేకరణ చేపడుతున్నట్లు తహసీల్దార్‌ అనురాధ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నష్టపరిహారం విషయమై ఎస్‌.మైదుకూరు, శెట్టివారిపల్లె, నంద్యాలపేట గ్రామాల్లో భూమి కోల్పోయిన రైతులు వారి ఆధార్‌ కార్డు, బ్యాంకు అకౌంట్‌ పాస్‌ బుక్‌ జిరాక్స్‌, సంబంధిత దస్తావేజులు, 1బీ, అడంగల్‌ సంబంధిత వీఆర్‌ఓకి రెండు రోజుల్లోపు సమర్పించాలని వివరించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్‌ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

'హోమియోపతి'కి ఆదరణ

- అన్ని వ్యాధులకు వైద్య సేవలు
- హోమియోపతి వైద్యంతో మెరుగైన ఆరోగ్యం
- 'సాక్షి'తో ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల సూపరింటెండెంట్‌ డాక్టర్‌ డి.ఆనందరావు



డాక్టర్‌ డి.ఆనందరావు, సూపరింటెండెంట్‌, హోమియోపతి వైద్యశాల, కడప

సాక్షి ఇంటర్వ్యూ

కడప రూరల్‌ : హోమియోపతి వైద్యానికి ప్రభుత్వాలు చేయూతనిస్తున్నాయి. ఫలితంగా ఈ వైద్యంపై ప్రజలు ఆకర్షితులవుతున్నారు. ఈ వైద్య విధానంలో అన్ని వ్యాధులకు వైద్యసేవలు లభిస్తుండడం... పైగా ఎలాంటి సైడ్‌ ఎఫెక్ట్స్‌ లేకపోవడం ఈ వైద్యానికి ఉన్న ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం కలిగి జీవన ప్రమాణాలను పెంపొందించడానికి హోమియోపతి వైద్యం దోహదపడుతుందని కడపలోని ప్రభుత్వ హోమియోపతి వైద్యశాల సూపరింటెండెంట్‌ డాక్టర్‌ డి.ఆనందరావు తెలిపారు.

హోమియోపతి వైద్యంపై ప్రజల్లో ఆదరణ ఎలా ఉంది?

రాష్ట్రంలో గుడివాడ, రాజమండ్రి తర్వాత రాయలసీమ కేంద్రంగా వైఎస్సార్‌ జిల్లా కడపలో మాత్రమే హోమియోపతి మెడికల్‌ కళాశాలకు అనుసంధానంగా ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రులు నడుస్తున్నాయి. ఈ ఆస్పత్రి కడప పాత రిమ్స్‌లోని పాత భవనంలో కొనసాగేది. కొన్ని రోజుల నుంచి కొత్త భవనంలో తాత్కాలికంగా వైద్య సేవలను అందిస్తున్నాం. గతంలో అవుట్‌ పేషెంట్స్‌ ఒక రోజుకు 80–150మందిలోపు వచ్చేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 200కు దాటుతోంది.

ఇక్కడ ఏమేమి వైద్య సేవలు లభిస్తున్నాయి?

హోమియోపతి ద్వారా దీర్ఘకాలిక వ్యాధులైన కిడ్నీ, షుగర్‌, బీపీతోపాటు గ్యాస్ట్రిక్‌, అలర్జీ, ఆయాసం, ముక్కులో కండ పెరగడం, ట్రాన్సిల్‌, ప్రోస్టేట్‌ గ్రంధి, తల, నడుము, కీళ్ల నొప్పులు, శ్వాస కోశ, స్త్రీలకు సంబంధించిన అన్ని వ్యాదులకు వైద్య సేవలు లభిస్తున్నాయి. అలాగే కోవిడ్‌ అనంతరం వచ్చే అనారోగ్య సమస్యలకు కూడా ఇక్కడ మంచి వైద్యం లభిస్తోంది. అదేవిధంగా ఎక్కడైనా కేన్సర్‌ తదితర వ్యాధులకు చికిత్స పొంది నయం కానటువంటి జబ్బులకు కూడా ఇక్కడ లభించే మందులతో ఉపశమనం పొందవచ్చు. జీవన ప్రమాణాన్ని పొడిగించుకోవచ్చు. ఈ ఆస్పత్రిలో సర్జరీలు మాత్రం చేయం. అలాంటి రోగులు ఎవరైనా వస్తే కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రెఫర్‌ చేస్తాం.

ఆస్పత్రి పనివేళల్లో మార్పులేవైనా ఉన్నాయా?

నిబంధనల ప్రకారం ఔట్‌ పేషెంట్లను ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు, అనంతరం 3.00 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చూస్తున్నాం. అవసరమైన ఇన్‌పేషంట్లకు సంబంధించిన వ్యాధిగ్రస్తులకు 24 గంటలు ఎప్పుడైనా వచ్చి ఆస్పత్రిలో అడ్మిట్‌ కావచ్చు. ఇందుకు సంబంధించి ఆస్పత్రిలో సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉంటారు. ఈ ఆస్పత్రి కడప పాత రిమ్స్‌లోని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పక్కనే ఉంది. ప్రజలు ఈ అంశాన్ని గమనించాలి.

ఈ ఆస్పత్రిలో వైద్య సదుపాయాల మాటేంటి?

ఈ ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వాలు రూ. 8 కోట్లు కేటాయించాయి. ఈ ఆస్పత్రిలో పురుషులు, స్త్రీలకు 45 పడకలు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం తాత్కాలికంగా 10 పడకలను ఇన్‌ పేషెంట్స్‌కు ఏర్పాటు చేశారు. ఇన్‌ పేషంట్స్‌ రోగులకు ఉచిత భోజన సదుపాయాన్ని కల్పిస్తాం. వైద్య పరీక్షలకు సంబంధించి ప్రస్తుతం రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో ఎక్స్‌రే సదుపాయాన్ని కల్పిస్తాం.

చిత్తశుద్ధితో ఉక్కు పరిశ్రమను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రైవేటు స్కూల్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు జోగిరామిరెడ్డి

కడప ఎడ్యుకేషన్‌ : చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమను సకాలంలో పూర్తి చేయాలని ప్రైవేటు స్కూల్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రవిశంకర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. బుధవారం కడపలోని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో జిల్లా మహాసభలు నిర్వహించారు. తొలిరోజు సభల్లో వీరు మాట్లాడారు. ఆర్‌ఎస్‌వైఎఫ్‌ రాష్ట్ర కార్యదర్శి కన్నెలూరు శంకర్‌ మాట్లాడుతూ జీవో 77తో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య దూరమైయిందన్నారు. ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు శివ, సోయల్‌, నగర సహాయ కార్యదర్శి రాజశేఖర్‌నాయక్‌, నగర ఉపాధ్యక్షుడు కార్తీక్‌, వెంకటేస్‌, జిల్లా నాయకులు మురళి, మహేష్‌, చంద్ర, వెంకటేసు, అజయ్‌, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరతో శనగల కొనుగోలు



శనగల కొనుగోలును పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ఓబులేసు

పెద్దముడియం : మార్క్‌ఫెడ్‌–నాఫెడ్‌ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం బుడ్డ శనగల కనీస మద్దతు ధర రూ.5335తో కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. బుధవారం ఆయన పెద్దపసుపుల గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు మొదట ఆర్బీకే కేంద్రాలలో శనగల విక్రయానికి రిజిస్టర్‌ చేసుకోవాలన్నారు. రైతులు నాణ్యమైన శనగలను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కొందరు రైతులు శనగలు అక్కడక్కడ డ్యామేజీ వచ్చాయని ఆయన దృష్టికి తీసుకురాగా 4 శాతం కన్న తక్కువగా ఉన్న డ్యామేజీ శనగలను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రవాణా ఖర్చులు, కాటా ఖర్చులు, లారీ లోడింగ్‌ కూలీల ఖర్చులు రైతులే భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్‌ డీఎంఅండ్‌హెచ్‌ఓ

కమలాపురం : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్‌ డీఎం అండ్‌ హెచ్‌ఓ ఖాదర్‌వల్లి తెలిపారు. బుధవారం స్థానిక క్రాస్‌ రోడ్డులో నూతనంగా ప్రారంభించిన అర్బన్‌ ప్రైమరీ హెల్త్‌ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే యూ పీహెచ్‌సీలో ఉన్న వసతుల గురించి సిబ్బందితో ఆరా తీశారు. మందుల సరఫరా ఎలా ఉంది? కొరత ఏమైనా ఉందా? వైద్య పరికరాలు ఇంకా ఎమైనా రావాల్సినవి ఉన్నాయా? అని వైద్యాధికారి నందకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనీమియా, హైరిస్క్‌ గర్భిణులను ఏ విధంగా గుర్తిస్తున్నారు? వారిని ఎక్కడికి రెఫర్‌ చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌ పై శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందించాలి



చిలంకూరులో వ్యాధిగ్రస్తులకు సూచనలు అందిస్తున్న అడిషనల్‌ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఖాదర్‌వలి

ఎర్రగుంట్ల : కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్యం అందించాలని అడిషనల్‌ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్‌ ఖాదర్‌వలి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చిలంకూరు పిహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వ్యాధిగ్రస్తుల ఇళ్ల వద్దకు వేళ్లి వారికి వైద్యం అందించి మందులను సకాలంలో అందించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సురేష్మా, సాయిచరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎర్రగుంట్ల పట్టణంలోని రాణీవనంలో ఉన్న పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్‌ జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

10వ తరగతి మార్కులే భవిష్యత్‌కు పునాది

ఎర్రగుంట్ల : పదవ తరగతిలో సాధించిన మార్కులే భవిష్యత్‌లో ఉన్నత చదువులకు పునాది అని ఎర్రగుంట్ల పట్టణ సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం తిప్పలూరు గ్రామంలో ఉన్న శ్రీసాయిచరణ్‌ హైస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఏకేఆర్‌ ఫంక్షన్‌ హాల్‌లో జరిగింది. ఈ సభకు సీఐ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు పక్కదారి పట్టకుండా పదిలో మంచి మార్కులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. రోజుకు ఎనిమిది గంటలు చదవాలన్నారు. విద్యార్థి దశలో ఉపాధ్యాయులు చెప్పిన నీతి నియమాలు భవిష్యత్‌లో ఉపయోగపడుతాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్‌ మోహనరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

పెండ్లిమర్రి : వేరుశనగ పంట సాగు చేసిన రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గొందిపల్లె గ్రామ పొలాల్లో బుధవారం వేరుశనగ పంటలో పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో ఆకు మచ్చ తెగుళ్లపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆకు మచ్చ తెగులు ఆశిస్తే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. వాటిని పూర్తిగా నివారించాలన్నారు. అనంతరం రైతులకు పంటల సాగుపై పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏలు రమణారెడ్డి, సుబ్బారావు, ఆత్మ పీడీ విజయలక్ష్మి, ఏఓలు పద్మజ, పద్మలత, బ్లెస్సీ, రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

ఎర్రగుంట్ల : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమాలు అందుతున్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనపై విద్యార్థినులతో చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వసుంధరదేవి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీలు శ్రీనివాసులు, వాసుదేవన్‌



మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు

పులివెందుల రూరల్‌ : ప్రతి ఒక్కరూ సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీలు శ్రీనివాసులు, వాసుదేవన్‌లు తెలిపారు. బుధవారం స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో సైబర్‌ నేరాలు, సఖిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, దిశా యాప్‌ డీఎస్పీ వాసుదేవన్‌లు హాజరై మాట్లాడుతూ లోన్‌ యాప్‌లు, ఉద్యోగ యాప్‌లు క్లిక్‌ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మీ చదువు, ఉద్యోగాలకు సంబంధించిన విషయాలకు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు అవసరమైన రీతిలో వినియోగిస్తూ చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే డబ్బులు వేరే అకౌంట్‌లోకి వెళితే ఏ నెంబర్‌కు కాల్‌ చేయాలి.. మొబైల్‌ పోగొట్టుకుంటే ఎలా దాన్ని తిరిగి తీసుకోవచ్చు.. ఎవరైనా ఇబ్బందులలో ఉన్నప్పుడు దిశ యాప్‌కు ఎలా కనెక్టు కావాలి, వన్‌ స్టాప్‌ సెంటర్‌ ద్వారా ఇబ్బందులకు గురైన వారు ఎలా ఉపశమనం పొందవచ్చుననే విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ వసుంధర, మహిళా సాధికారిత కో ఆర్డినేటర్‌ శేష మహేశ్వరమ్మ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శభాష్‌ దస్తగిరి

జాతీయస్థాయి టెన్నిస్‌ డబుల్స్‌లో ఛాంపియన్‌గా నిలిచిన హోంగార్డు



హోంగార్డు దస్తగిరిని అభినందిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌

కడప అర్బన్‌ : జిల్లా పోలీస్‌ హెడ్‌ క్వార్టర్స్‌లో హోంగార్డుగా విధులను నిర్వహిస్తున్న ఎస్‌.కె. దస్తగిరి (హెచ్‌జీ 432) టెన్నిస్‌లో మరిన్ని విజయాలను సాధించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ ఆకాంక్షించారు. కడప నగరంలో ఈనెల 14 నుంచి 21 వరకు నిర్వహించిన ఆల్‌ ఇండియా సీనియర్‌ టెన్నిస్‌ పోటీల్లో 35 ప్లస్‌ డబుల్స్‌ విభాగంలో తన పార్టనర్‌ అరుణ్‌కుమార్‌ రెడ్డితో కలిసి ఛాంపియన్‌ షిప్‌ సాధించారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక పెన్నార్‌ పోలీస్‌ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌, దస్తగిరిని ప్రత్యేకంగా అభినందించారు. ముున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. దస్తగిరి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ ప్రోత్సాహంతోనే తాను విజయాలు సాధించగలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ ఎస్‌.ఆర్‌. వంశీధర్‌గౌడ్‌, ఆర్‌ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

యాక్టివా హెచ్‌ స్మార్ట్‌ మార్కెట్‌లోకి విడుదల



వినియోగదారుడికి తాళాలు అందజేస్తున్న షోరూం ఎండీ సుంకర ఐశ్వర్య

కడప కార్పొరేషన్‌ : హోండా కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన యాక్టివా హెచ్‌ స్మార్ట్‌ వాహనం మార్కెట్‌లోకి విడుదలైంది. బుధవారం కడప నగరం, చిన్నచౌకులోని అమోఘా హోండా షోరూంలో మేనేజింగ్‌ డైరెక్టర్‌ సుంకర ఐశ్వర్య, ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్‌ నేషనల్‌ హెడ్‌ సురేష్‌, ఏపీ ఇన్‌చార్జి ప్రభాకర్‌ ఈ వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోండా కంపెనీ అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. మొదటి రోజు 10 వాహనాలను డెలివరీ ఇచ్చినట్లు షోరూం సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో కొటాక్‌ ఫైనాన్స్‌ ఇన్‌చార్జి సురార్‌, శ్రీరామ్స్‌ ఫైనాన్స్‌ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌, రెడ్‌ ముత్తూట్‌ ఇన్‌చార్జి ఫిరోజ్‌, షోరూం జనరల్‌ మేనేజర్‌ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్‌



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్‌

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ ఆనంద్‌నాయక్‌ తెలిపారు. బుధవారం నగరంలోని నిహార్‌ స్కిల్‌ ఎడ్యుకేషన్‌లో డీడీయూజీకేవై పథకం ద్వారా సీ–డ్యాప్‌ సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామీణ నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్న యువతీ యువకులు శిక్షణ తరగతులను, భోజన వసతి సౌకర్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీ–డ్యాప్‌ జాబ్స్‌ డెవలప్‌మెంట్‌ మేనేజర్‌ వేణుమాధవ్‌, నిహార్‌ స్కిల్‌ ఎడ్యుకేషన్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఇంతియాస్‌ అహ్మద్‌ పాల్గొన్నారు.

ఆఫీసర్స్‌ క్లబ్‌ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌, క్లబ్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

కడప సిటీ: ఆఫీసర్స్‌ క్లబ్‌ కేవలం అధికారులకే కాకుండా వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు కూడా పరిచయం చేయాలని ఆఫీసర్స్‌ క్లబ్‌ చైర్మన్‌, కలెక్టర్‌ విజయరామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో క్లబ్‌ అసోసియేషన్‌ రూపొందించిన 2023 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఉద్యోగులు రోజూ విధుల్లో ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతుంటారని, అందువల్ల ప్రతి ఒక్క ఉద్యోగికి శారీరక వ్యాయామం ఎంతో అవసరమన్నారు. కడప ఆఫీసర్స్‌ క్లబ్‌లో అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆఫీసర్స్‌ క్లబ్‌ వైస్‌ చైర్మన్‌, జేసీ సాయికాంత్‌వర్మ, కన్వీనర్‌ డ్వామా పీడీ యదుభూషణరెడ్డి,కో కన్వీనర్‌, బీసీ సంక్షేమశాఖాధికారి బ్రహ్మయ్య, కోశాధికారి వీరభద్రయ్య, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



కోడిగుడ్లపాడులో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ జాకీర్‌షరీఫ్‌

కాశినాయన : పత్తిపంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్‌ తెలిపారు. బుధవారం మండలంలోని కోడిగుడ్లపాడు, ఆనంవారిపల్లె గ్రామాల్లో సాగులో ఉన్న పత్తిపంటను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తిపంటలో గులాబిరంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పత్తిపంటలో గుడ్డిపువ్వులను, పురుగు ఆశించిన పువ్వులను ఏరివేయాలన్నారు. గులాబిరంగు పురుగు నివారణకు వేపగింజ కషాయం లేదా ప్రొఫినోపాస్‌ 400 మిల్లీలీటర్లు ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలన్నారు. 15 రోజులకొకసారి మందులను పిచికారి చేస్తే పురుగుల బెడద నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. సింథటిక్‌ పైరిథ్రాయిడ్‌ మందులను పంట 120 రోజుల తర్వాత మాత్రమే పిచికారి చేసుకోవాలని సూచించారు. ఎక్కువ సార్లు పిచికారి చేసినట్లైతే తెల్లదోమ ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంకు తనిఖీ చేసిన తహసీల్దారు



పెట్రోలు బంక్‌ తనిఖీ చేస్తున్న తహసీల్దారు

పోరుమామిళ్ల : నర్సింగుపల్లె సమీపంలోని పీఎస్‌ఆర్‌ ఫిల్లింగ్‌ స్టేషన్‌ (పెట్రోల్‌ బంక్‌)ను బుధవారం తహసీల్దారు విజయకుమారి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బంక్‌లో మౌలిక వసతులను పరిశీలించారు. వినియోగదారులకు పెట్రోల్‌ బంకులో కల్పించాల్సిన వసతులు వివరించి ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాలన్నారు. పెట్రోలు బంక్‌ కేవలం ఆయిల్‌ అమ్మడమే కాక వినియోగదారుల సౌకర్యాలు కూడా చూడాలన్నారు. ఆమె వెంట ఆర్‌ఐ యానాదయ్య, వీఆర్‌ఓ రామలక్షుమ్మ పాల్గొన్నారు.

పనుల నిర్వహణ బాగుంది

ఉపాధి హామీ బహిరంగ సభలో అడిషనల్‌ పీడీ శివప్రసాద్‌



మాట్లాడుతున్న అడిషనల్‌ పీడీ శివప్రసాద్‌

రాజుపాళెం : ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల నిర్వహణ సక్రమంగా ఉందని అడిషనల్‌ పీడీ శివప్రసాద్‌ అన్నారు. రాజుపాళెంలోని వైఎస్సార్‌ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సకాలంలో పనులు చేయించడంలో ఉపాధి అధికారులు, సిబ్బంది పనితీరు భేష్‌ అని కొనియాడారు. మండలంలో 2021–2022 ఏడాదికి రూ.5.61 కోట్ల పనులను చేపట్టామన్నారు. ఆ పనుల్లో మెటీరియల్‌ కింద రూ.1.83 కోట్ల కూలీల వేతనాలు, రూ.3.78 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. పంచాయతీ రాజ్‌ శాఖకు సంబంధించి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు, ప్రహరీ, సీసీ రోడ్ల నిర్మాణం, పంట కాలువలో పూడిక తీత పనులు చేసినట్లు వివరించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల సోషల్‌ ఆడిట్‌ నివేదికలపై అధికారులు చర్చించారు. ఏపీడీ ఖాదర్‌ బాషా, అంబుడ్స్‌మెంట్‌ యోగాంజనేయరెడ్డి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఏపీఓ గంగయ్య, ఎస్‌ఆర్‌పీ తిరుమలేశ్‌, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్‌ అసిసెట్లు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.